## ఇంటర్ పరీక్షకు 97 శాతం హాజరు

### ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో బుధవారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం భౌతికశాస్త్రం, అర్థశాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు. మొత్తం 55 కేంద్రాల్లో జరిగిన ఈ పరీక్షకు మొత్తం 14,482 మందికి 14,078 మంది హాజరవ్వగా 403 మంది గైర్హాజరయ్యారు. 97 శాతం హాజరు నమోదైంది. సాధారణ విభాగంలో 12,669 మందికి 12,394 మంది హాజరవ్వగా 274 మంది గైర్హాజరయ్యారు. వృత్తి విద్యా విభాగంలో మొత్తం 1,813 మందికి 1,684 మంది హాజరవ్వగా 129 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు యోహాను తెలిపారు.

# జనానికి దూరంగా..

# సమావేశాల్లో బిజీగా..

**జిల్లా అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాల్లోనే**

**క్షేత్రస్థాయిలో జనం వద్దకు వెళ్లలేని పరిస్థితుల్లో అధికారులు**

**కార్యాలయాలకు వెళ్లినా కాన్ఫరెన్స్‌లో ఉండటంతో తప్పని పడిగాపులు**

**ఒకేసారి జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారుల కాన్ఫరెన్స్‌లు**

**దిక్కుతోచని స్థితిలో సోమవారం పిజిఆర్‌ఎస్‌కు జనం**

**జనం సమస్యలను వదిలి.. సమావేశాలతో సరిపెట్టడంపై విమర్శలు**

'రామారావు తన సమస్యను కిందిస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదని సంబంధిత శాఖ జిల్లా కార్యాలయానికి వచ్చాడు. సార్.. కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్స్(విసి)కు వెళ్లారని అక్కడి సిబ్బంది తెలిపారు. దీంతో వెళ్లిపోయి మరోసారి వచ్చారు. సార్.. లోపలే ఉన్నారుగానీ.. వీడియో కాన్ఫరెన్స్ జరుగుతోందని సమాధానం రావడంతో బయటే పడిగాపులు పడాల్సిన పరిస్థితి. సదరు అధికారికి తమ సమస్య చెప్పుకునేందుకు పనులు మానుకుని రోజులు తరబడి తిరుగుతూ ఆ వ్యక్తి పడిన కష్టం అంతాఇంతా కాదు'.

'కిషోర్ అనే వ్యక్తి తన సమస్యకు సంబంధించిన ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారిని కలిసేందుకు వచ్చారు. కలెక్టరేట్‌లో మీటింగ్‌లో ఉన్నారని, ఒకసారి, కోర్టు పని మీద వెళ్లారని మరోసారి.. సమాధానం తప్ప ఆయన దర్శనం మాత్రం కాలేదు. తమ ప్రాంతంలోకి వచ్చినప్పుడు చెప్పకుందామంటే క్షేత్రస్థాయికి అధికారులు రావడం అరుదుగా మారిపోయింది. దీంతో గత్యంతరం లేక సోమవారం పిజిఆర్‌ఎస్‌లో వినతి ఇచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది'.



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో ఫీల్డ్‌కు వెళ్లి జనాల సమస్యలను తెలుసుకునే పరిస్థితి లేకుండాపోయింది. ప్రతిరోజూ వీడియో కాన్ఫరెన్స్‌లు, జిల్లా ఉన్నతాధికారుల సమావేశాలతోనే బిజీగా గడుపుతున్నారు. దీంతో క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులకు అవగాహన లేకుండా పోతుంది. కిందిస్థాయి అధికారులు ఏం చెబితే అదే వాస్తవమని భావించి నిర్ణయాలు తీసుకుంటున్న పరిస్థితి ఉంటోంది. మండల స్థాయిలో అధికారులు సైతం వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాలతో బిజిబిజీగా ఉంటూ ప్రజలకు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిపాలనలో మార్పు కన్పిస్తుందని అంతా ఆశించారు. అందుకు భిన్నంగా పాలన సాగడంపై విమర్శలు విన్పిస్తున్నాయి. జిల్లా అధికారులు సామాన్యులకు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. రెండు జిల్లాల్లో దాదాపు 40 లక్షల జనాభా ఉన్నారు. దీంతో ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. కిందిస్థాయి అధికారులకు సమస్యలు చెప్పుకున్నా పరిష్కారం కాకపోవడంతో జిల్లా అధికారులను కలిసి తమ సమస్యను చెప్పుకోవాలని జనం చూస్తున్నా అవకాశం దక్కడం లేదు. వారంలో ఏడు రోజులు వీడియో కాన్ఫరెన్స్‌లు, సమావేశాలతో బిజీగా ఉంటే ప్రజలను అధికారులు కలిసేదెప్పుడో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఏదైనా శాఖకు సంబంధించి జిల్లా అధికారిని కలవాలంటే ఒక రోజంతా నిరీక్షించినా సాధ్యం కావడం లేదని గగ్గోలు పెడుతున్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లకు హాజరుకాకపోతే జిల్లా అధికారులపై ఉన్నతాధికారులు చిందులు తొక్కుతున్నట్లు తెలుస్తోంది. దీంతో గంటలు తరబడి వీడియో కాన్ఫరెన్స్‌ల్లో పాల్గొనడంతోనే జిల్లా అధికారులకు సరిపోతుంది. వ్యవసాయం, పంచాయతీ, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యుఎస్, మత్స్యశాఖ, హౌసింగ్, మార్కెటింగ్ ఇలా ఏశాఖకు సంబంధించిన అధికారులైనా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్తే ప్రజల సమస్యలు క్షుణ్ణంగా అర్థమవుతాయి. ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉందనేది తెలుస్తోంది. కిందిస్థాయి అధికారులు కార్యాలయాలకు వస్తున్నారో, లేదో అర్థమవుతుంది. అలాకాకుండా జిల్లా, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులకు ఆదేశాలు ఇవ్వడం, జిల్లా అధికారులు కిందిస్థాయి సిబ్బందికి అదే వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేయడంతోనే రోజులు గడిచిపోతున్నాయి. సోమవారం పిజిఆర్‌ఎస్ ఉండటంతో జిల్లా కేంద్రంలోనే అధికారులంతా ఉండాలి. ఆ తర్వాత ఐదు రోజులు కూడా సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌ల పేరుతో జిల్లా అధికారులను హెడ్‌క్వార్టర్‌లోనే బందీలుగా ఉంచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనం జిల్లా అధికారులను నిలదీస్తే మీటింగ్‌లో ఉన్నామని సమాధానం చెబుతున్నారు. కొన్ని శాఖలకు సంబంధించిన అధికారులు ఇదే అవకాశంగా పని మొత్తం పక్కన పెట్టేస్తున్నారు. ఒకవేళ సమావేశం లేకపోయినా ఉన్నట్లు కార్యాలయాల్లోని అధికారులతో చెప్పించి సొంత పనులు చూసుకుంటున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. ఒకే సమయంలో జిల్లా కలెక్టర్, రాష్ట్రస్థాయి అధికారుల వీడియో కాన్ఫరెన్స్‌లు సైతం నిర్వహిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో జిల్లా అధికారులకు ఏం చేయాలో అర్థంకాని పరిస్థితి ఉంటుందని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో అధికారులు ఇస్తున్న నివేదికలకు.. వాస్తవ పరిస్థితికి సంబంధం ఉండటం లేదు. దీంతో ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు అమలు చేసినా జనాలకు చేరని పరిస్థితి ఉందనే చర్చ సైతం సాగుతోంది.

**జనానికి సోమవారం పిజిఆర్‌ఎస్‌నే దిక్కు..**

జిల్లా అధికారులను కలిసే అవకాశం జనానికి లేకుండాపోవడంతో ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగే పిజిఆర్‌ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక)నే దిక్కుగా మారింది. ఎంఎల్‌సి ఎన్నికల కోడ్ నేపథ్యంలో దాదాపు నెలన్నరపాటు పిజిఆర్‌ఎస్ నిలిచిపోయింది. దీంతో జనం తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. జిల్లా అధికారులు మామూలు రోజుల్లో దొరకకపోవడం, పిజిఆర్‌ఎస్‌లో జిల్లా అధికారులంతా ఉంటారని భావించి జనం దానికి క్యూ కడుతున్నారు. మండలస్థాయిలో పిజిఆర్‌ఎస్ అమలు చేస్తున్నా జనాలు అక్కడ ఫిర్యాదులు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. ఎందుకుంటే మండలస్థాయిలో తీసుకుంటున్న ఫిర్యాదులను అధికారులు సరిగా పట్టించుకోవడం లేదనే అభిప్రాయం జనాల్లో నెలకొంది. వారంలో సగం రోజులైనా జిల్లా అధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటేనే ప్రజలకు న్యాయం జరిగే పరిస్థితి ఉంటుంది.

## భీమవరంలో బాంబు కలకలం

### విష్ణు డెంటల్ కాలేజీకి మెయిల్ - జల్లెడ పట్టిన పోలీసులు

### ఏమీ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్న జనం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

జిల్లా కేంద్రం భీమవరం ప్రజలు బాంబు భయంతో ఉలిక్కిపడ్డారు. దేశవ్యాప్తంగా పేరొందిన శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్ విద్యాసంస్థల ప్రాంగణంలోని విష్ణు డెంటల్ కళాశాలలో బాంబు పెట్టినట్లు బుధవారం మధ్యాహ్నం ప్రిన్సిపల్ డాక్టర్ రామరాజుకు మెయిల్ వచ్చింది. దీంతో యాజమాన్యం అప్రమత్తమై పోలీ సులకు సమాచారం అందించింది. విద్యార్థులను, అధ్యాపకులను, సిబ్బందిని హుటాహుటీన బయటకు పంపించేశారు. జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీ పర్యవేక్షణలో ఎప్పటికప్పుడు బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగి విష్ణు డెంటల్ కళాశాలలో జల్లెడ పడుతున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు నిర్వహించారు. అనంతరం డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దింపి మరోసారి తనిఖీలు చేసినా ఎటువంటి అనుమానిత వస్తువులుగాని, పరికరాలుగానీ లభించకపోవడంతో బాంబు బెదిరింపు ఉత్తిదేనని తేలింది. దీంతో అటు యాజమాన్యం, ఇటు పోలీసులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. అదే సమయంలో పోలీస్ సైబర్ క్రైమ్ టీమ్ రంగంలోకి దిగి మెయిల్ ఎక్కడ నుంచి వచ్చింది, ఎవరు చేశారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. భీమవరం రూరల్ ఎస్ఐ వీర్రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విష్ణు డెంటల్ కాలేజీలో తనిఖీలు చేస్తున్న బాంబ్స్ స్క్వాడ్

**ఆందోళనకు గురైన విద్యార్థుల తల్లిదండ్రులు**

కళాశాలకు బాంబు బెదిరింపు రావడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ప్రధానంగా కళాశాల హాస్టల్లో ఉండి చదువుకుంటున్న దూరప్రాంత విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. యాజమాన్యానికి, సమీప ప్రాంతాల్లో ఉన్న బంధువులకు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫోన్లు పెద్దసంఖ్యలో వచ్చాయి.

## కన్నాపురంలో గిరిజనుల ఆందోళన

### ఎస్‌డిఎఫ్‌ఒపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

గిరిజనుడైన మడకం యాకోబుపై దాడి చేసి గాయపరిచిన ఎస్‌డిఎఫ్‌ఒపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ గిరిజనులు బుధవారం స్థానిక అటవీ శాఖ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సబ్‌డిఎఫ్ఒకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బుట్టాయగూడెం మండలం గుళ్లపూడికి చెందిన మడకం యాకోబును ఈ నెల 11న అదుపులోకి తీసుకుని కన్నాపురం అటవీశాఖ కార్యాలయానికి తరలించి శారీరకంగా హింసించారన్నారు. దీంతో తీవ్ర గాయాల పాలైన యాకోబు జంగారెడ్డిగూడెం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. గిరిజనులను అవమానించేలా యాకోబును దుర్భాషలాడారని ఆరోపించారు. అయితే కార్యాలయంలో రేంజర్ లేకపోవడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. కొయ్యలగూడెం ఎస్ఐ వి.చంద్రశేఖర్ అక్కడికి చేరుని ఆందోళనకారులతో చర్చించారు. దీనిపై తదుపరి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

## 'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

### కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆమె జిల్లా అధికారులతో మాట్లాడారు. పరీక్షా పత్రాలు భద్రపర్చే కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెల 17 నుండి 31వ తేదీ వరకు పదో తరగతి రెగ్యులర్ వారికీ, 17 నుండి 28వ తేదీ వరకూ ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు పరీక్షలు ఉదయం 9.30 గంటల నుండి 12.45 వరకు జరుగుతాయన్నారు. రెగ్యులర్, ప్రయివేటు కలిపి జిల్లాలో 133 కేంద్రాల్లో 25,179 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఓపెన్ స్కూళ్ల నుండి 793 మంది విద్యార్థులకుగాను 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షల సమయంలో అవసరమైన బస్సులను నడపాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షలు కట్టుదిట్టంగా, ఎక్కడా కాపీయింగ్ జరగకుండా నిర్వహించాలన్నారు. పరీక్షలు నిర్వహించే సమయంలో అన్ని పరీక్షా కేంద్రాల పరిధిలో 163-బి సిఆర్‌పిసి సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలను, నెట్ సెంటర్లను మూసి వేయాలని అన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు ముందస్తుగా పరిశీలన చేసుకోవాలన్నారు. దీనికి ముందు అమరావతి నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఎస్‌ఎస్‌సి పరీక్షలకు సంసిద్ధత, రాబోయే కలెక్టర్ల కాన్ఫరెన్స్ కోసం సూచనలు, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం, సానుకూల ప్రజావగాహన, పి4 మోడల్ సర్వే తదితర అంశాలపై కలెక్టర్లు, ఎస్‌పిలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షల నిర్వహణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇతర చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లను అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వాణపై సోషల్ మీడియాలో ఎటువంటి రూమర్లకూ తావులేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వాసుదేవరావు, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, డివిఇఒ ప్రభాకరరావు, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్, డ్వామా పీడీ సుబ్బారావు, డిపిఒ కె.అనురాధ, ఆర్‌టిసి డిఎం బి.వాణి, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.మాలిని, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

## దరఖాస్తుల పరిష్కారం సంతృప్తికరంగా ఉండాలి

### పిజిఆర్‌ఎస్ పరిష్కార విధానంపై సిఎంఒ నుంచి ఐవిఆర్‌ఎస్ సర్వే

### కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

దరఖాస్తుదారుడు సంతృప్తి చెందేలా పిజిఆర్‌ఎస్ దరఖాస్తుల పరిష్కారం ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తహశీల్దార్లను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో బుధవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం, రాష్ట్రమంత్రులు, ఎంఎల్‌ఎ తదితర ప్రజాప్రతినిధుల నుండి అందిన దరఖాస్తుల పరిష్కారంపై ఆర్‌డిఒలు, తహశీల్దార్లతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. పేదలు పిజిఆర్‌ఎస్‌లో తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ దరఖాస్తులు సమర్పిస్తుంటారని, వాటికి అర్హులైన దరఖాస్తుల్లో ఫిర్యాదుదారుడు సంతృప్తికర రీతిలో నాణ్యమైన పరిష్కారాన్ని అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తులను నిర్ణీత సమయంలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అర్హత లేని దరఖాస్తులను తిప్పి పంపుతూ అందుకు గల కారణాలను స్పష్టంగా దరఖాస్తుదారునికి, సదరు ప్రజాప్రతినిధికి తెలియజేయాలని అన్నారు. దరఖాస్తు అందిన తర్వాత అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించారా, పరిష్కార విధానం, అధికారుల ప్రవర్తన, తదితర అంశాలపై ముఖ్యమంత్రి కార్యాలయం నుండి ఫిర్యాదుదారునితో ఐవిఆర్‌ఎస్ విధానంలో ఫోన్ ద్వారా అడిగి తెలుసుకుంటారని చెప్పారు. అధికారుల ప్రవర్తన, నడవడిక, జవాబుదారీతనం తదితర అంశాలను కూడా అడిగి తెలుసుకుంటారన్నారు. భూవివాదాల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం మండల రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వారి సమస్యలను సావధానంగా వినాలన్నారు. రెవెన్యూ చట్టాలపై తహశీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని, తాను మండల పర్యటనల్లో తహశీల్దార్ కార్యాలయం, ఇతర మండల కార్యాలయాలను సందర్శించి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన దరఖాస్తుల పరిష్కార విధానాన్ని పరిశీలిస్తామన్నారు. డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్, ఆర్‌డిఒలు అచ్యుత్ అంబరీష్, రమణ, ఎస్‌డిసి.భాస్కర్, జిల్లాలోని అన్ని మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

## కిలోమీటర్ పరిధిలో రెండు ప్రమాదాలు

**లారీని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు ఘటనలో 11 మందికి గాయాలు**

**ఆర్‌టిసి బస్సును వెనుక నుంచి ఢీకొన్న లారీ**

**రెండు ప్రమాదాలూ జాతీయ రహదారిపైనే**

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్, సిటీ

ఏలూరు జాతీయ రహదారిలో ఆరు రోజుల వ్యవధిలో నాలుగు బస్సు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అటు దెందులూరు, ఇటు మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదాల చోటు చేసుకున్నాయి. మొదటి రెండు ప్రమాదాల్లో ప్రయివేట్ ట్రావెల్స్ బస్సులు బోల్తా పడ్డాయి. బుధవారం ఒక్కరోజే రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆర్‌టిసి బస్సు లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి అదే లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకున్న ఈ ప్రమాదంలో 11 మంది గాయాలపాలయ్యారు. అలాగే ముందుగా వెళ్తున్న ఆర్‌టిసి ట్రాలీ లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ రెండు ఘటనలకు సంబంధించిన ఏలూరు మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కాకినాడ డిపోకు చెందిన సూపర్ లగ్జరీ బస్సు మంగళవారం రాత్రి కాకినాడ నుంచి గుంటూరుకు బయలుదేరింది. బస్సు తెల్లవారుజామున 4:30 సమయంలో ఏలూరు జాతీయ రహదారిలోని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాల సమీపానికి చేరుకునేసరికి ముందుగా వెళ్తున్న లారీని ఓవర్‌టేక్ చేయబోయి అదుపుతప్పి అదే లారీని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో సహా మొత్తం 11 మందికి గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో బస్సులో 15 మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు డ్రైవర్‌కు గాయాలు కాలేదు. గాయాలైనవారిలో లారీ డ్రైవర్ కడియం రామశేషు, బస్సులో ప్రయాణికులు ఐ.సత్యసాయి (కాకినాడ), కర్రి హారిక (రావులపాలెం), వెళ్ల రాజు (మాచవరం), కె.సుబ్రహ్మణ్యం (కాకినాడ), కె.వెంకటలక్ష్మి (రామచంద్రపురం), కె.సురేష్ (కాకినాడ), ఆరేపల్లి సాయి దుర్గాప్రసాద్ (తణుకు), వి.దత్తునాయక్ (గుంటూరు), జె.పవన్‌కుమార్ (కాకినాడ), ఆకుల శివాజీ (కడియపులంక) ఉన్నారు. వీరందరిని 108 వాహనాల సాయంతో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కొందరు వారి వారి గమ్యస్థలానికి వెళ్లిపోయారు. బస్సు లారీ పాక్షికంగా దెబ్బతినడంతో వాటిని ఏలూరు మూడో పట్టణ పోలీసులు పక్కకు తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. దాదాపు తెల్లవారుజామున ప్రమాదం జరగడంతో గంటన్నర పాటు విజయవాడ వైపు వెళ్లే ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు రెండు గంటలు శ్రమించి బస్సును లారీని పక్కకు జరిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.



ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ప్రమాదంలో దెబ్బతిన్న లారీ వెనుకభాగం

**క్షతగాత్రులకు రెడ్డి అప్పలనాయుడు పరామర్శ**

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఎపిఎస్ ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్, బోర్డు డైరెక్టర్ రెడ్డి అప్పలనాయుడు పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబాలకు అండగా ఉంటుందన్నారు. వారికి అవసరమైన సహాయం అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు ఏలూరు డిపో అసిస్టెంట్ మేనేజర్ మురళీ, స్టేషన్ మేనేజర్ కుమారి, ఏలూరు ఆర్‌టిసి అధికారులు, జనసేన నాయకులు ఉన్నారు.

**ఆర్‌టిసి బస్సును ఢీకొన్న లారీ**

విజయవాడ డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు విశాఖపట్నం నుంచి విజయవాడ మంగళవారం రాత్రి 10.30 గంటలకు బయలుదేరింది. బస్సులో ఉన్న ప్రయాణికులందరూ వారి వారి గమ్యస్థానాల్లో దిగిపోగా బస్సు చివరి ప్రయాణికుడు ఏలూరు ఆశ్రం ఆసుపత్రి వద్ద దిగాడు. అనంతరం బస్సు విజయవాడ వైపు వెళ్తున్న సమయంలో గురుకుల పాఠశాల సమీపానికి చేరుకునేసరికి వెనుక నుంచి ట్రాలీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు వెనుక భాగం పూర్తిగా దెబ్బతింది. బస్సులో ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. లారీ డ్రైవర్‌కు, బస్సు డ్రైవర్‌కు గాయాలు కాలేదు. ఈ ఘటనపై మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత రెండు వాహనాలను మూడో పట్టణ పోలీసులు రోడ్డు పక్కకు చేర్చి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు.

లారీ ఢీకొని దెబ్బతిన్న బస్సు వెనుకభాగం

## గ్రామీణాభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలి

### జెడ్‌పి ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గ్రామీణ అభివృద్ధి పనులు వేగంగా, నాణ్యత ప్రమాణాలతో పూర్తయ్యేలా అధికారులు కృషి చేయాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ ఛైర్మన్ గంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. ఏలూరులోని జిల్లా పరిషత్ క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంటా పద్మశ్రీ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన పంచాయతీరాజ్ పనులపై క్రమం తప్పకుండా పర్యవేక్షణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఎంజిఎన్‌ఆర్‌ఇజిఎస్ కింద చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు, కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. పిఎంజిఎస్‌వై కింద రహదారి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అందరికీ నచ్చేలా ఆధునిక బంగారు ఆభరణాలు

### సిఎంఆర్ జ్యువెలరీ మాల్‌ను ప్రారంభించిన సినీ నటి మీనాక్షిచౌదరి

**ఏలూరు సిటీ :** మహిళలు మెచ్చే, వారికి నచ్చే విధంగా ఆధునిక బంగారు ఆభరణాలు సిఎంఆర్ జ్యూవెలరీ మాల్‌లో అందుబాటులో ఉన్నాయని సినీ నటి మీనాక్షిచౌదరి అన్నారు. ఏలూరులోని సిఎంఆర్ కాంప్లెక్స్‌లో సిఎంఆర్ జ్యూవెలరీ షాపును సినీ నటి మీనాక్షి చౌదరి, మాజీ ఎంఎల్‌ఎ అంబికా కృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ మహిళలకు నచ్చే విధంగా వారు మెచ్చే విధంగా ఆధునిక బంగారు ఆభరణాలు అందుబా టులో ఉన్నాయని తెలిపారు. ఈ షాపును తన చేతుల మీదుగా ప్రారంభించడం తన అదృష్టమన్నారు. ఏలూరు నగర ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సిఎంఆర్ జ్యూవె లరీ షాపును సందర్శించి కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త చందన మోహన్ రావు, మావూరి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ నటి మీనాక్షిచౌదరి

## రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించాలి

### ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక అన్నే భవనంలో రొయ్యల రైతుల సమస్యలపై ఆయన మీడియాతో మాట్లాడారు. రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్‌గా మారి కొనుగోలు ధరలు తగ్గించేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని, తగిన దిగుబడులు కూడా రావడం లేదని చెప్పారు. గతంలో వనామీ రొయ్యల ఫీడ్ ధర టన్ను రూ.45 వేలు ఉంటే ప్రస్తుతం లక్షా ఐదు వేలకు పెరిగిపోయిందన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా రొయ్యలకు గిట్టుబాటు ధర పెరగలేదన్నారు. వంద కౌంట్ రొయ్య ధర రూ.260 నుండి రూ.230, 50 కౌంట్ రూ.380 నుండి రూ.350కు, 40 కౌంట్ రూ.420 నుండి రూ.360కు పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్యల రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. పెరిగిన ఫీడ్ ధరలు తగ్గించేలా చర్యలు చేపట్టాలని కోరారు. నాణ్యమైన సీడ్ అందించాలన్నారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ రూ.1.50 సబ్సిడీ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు. రొయ్యల రైతులు చేస్తున్న ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కమిటీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇప్పటికైనా రొయ్యల రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుండపనేని సురేష్ పాల్గొన్నారు.

## చెట్లకు హాని లేకుండా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి



చెట్లకు హాని కలిగేలా ఉన్న విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం మారుతినగర్ కరుణా కాంప్లెక్స్ పక్క రోడ్డులో విద్యుత్ స్తంభాల వల్ల రోడ్డు పక్కన ఉన్న చెట్లకు హానికరంగా ఉందని సిపిఎం పట్టణ కన్వీనర్ పి.సూర్యారావు అన్నారు. విద్యుత్ శాఖాధికారులు స్పందించి పాత లైనులో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ఆయన కోరారు. లేకపోతే పర్యావరణ పరిరక్షణ సంస్థలైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**వైసిపి ఆధ్వర్యాన ర్యాలీ, కలెక్టర్‌కు వినతి**

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వైసిపి ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏలూరులోని ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళి అర్పించిన అనంతరం వైసిపి నాయకులు ర్యాలీగా కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా దూలం నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. విద్యార్థులకు, నిరుద్యోగులకు వైసిపి ఎప్పుడూ అండగా నిలుస్తుందని చెప్పారు. వారికి ఎటువంటి కష్టం వచ్చినా వారితో కలిసి నడుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, నిరుద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కారుమూరి సునీల్‌కుమార్, జయప్రకాష్, కంభం విజయరాజు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పాఠశాలలో సైన్స్ ప్రదర్శన

ప్రజాశక్తి - ముసునూరు

విద్యార్థులు ప్రతిభ కనబరిచేందుకు సైన్స్ ప్రదర్శన ఎంతగానో తోడ్పడుతుందని ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని ముసునూరు భారతి విద్యానికేతన్ పాఠశాలలో సైన్స్ విజ్ఞాన ప్రదర్శన కార్యక్రమం ఆ పాఠశాల ప్రిన్సిపల్ కొండేటి విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్సు పరికరాలపై అవగాహన కల్పించారు. సైన్సులో మార్పులు ఎలా సాధించాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సర్పంచి కొండేటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - ముసునూరు

పదో తరగతి పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఇఒ బివిఎస్.సుబ్బారావు అన్నారు. మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎల్‌విఎస్.నాగేంద్రరావుకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు మార్కులు ఎలా సాధించాలో సూచనలు, సలహాలు ఇచ్చారు.

## మామిడి కోతపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

మామిడి పంట సాగులో మెలకువలు పాటించి పండిస్తే అధిక దిగుబడి పొందవచ్చని గ్రామోదయ ట్రస్ట్ ఛైర్మన్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రమణక్కపేటలో మామిడి పంట కోత సమయంలో నష్ట నివారణ, యజమాన్య చర్యలపై అవగాహనా కార్యక్రమాన్ని ఉద్యాన శాఖ, గ్రామోదయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ రాధారాణి మాట్లాడుతూ మామిడి పంట కోత సమయంలో, అనంతరం నష్ట నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులకు పలు సూచనలు చేశారు. కోత సమయంలో చెట్లకు నీటి తడులను తగ్గించడం వల్ల కాయల నాణ్యత మెరుగవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ రాధారాణి, సిఇఒ డాక్టర్ సాయికృష్ణ, మండల ఉద్యానవన అధికారి కె.జ్యోతిప్రియాంక, మండల ఎంపిపి కొండా దుర్గాభవాని, గ్రామస్తాయి రైతులు పాల్గొన్నారు.

## సిపిఎం మండల కార్యదర్శి ఇంట విషాదం

**బ్రెయిన్ కేన్సర్‌తో కోడలు మృతి**

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సిపిఎం మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు ఇంట విషాదం నెలకొంది. కుమారుడి భార్య వెంకటలక్ష్మి (25) బ్రెయిన్ కేన్సర్‌తో బుధవారం తెల్లవారు జామున మృతి చెందింది. ఆమెకు బ్రెయిన్ కేన్సర్ సోకడంతో సంవత్సరం నుంచి వైద్యం చేపిస్తుండగా మంగళవారం రాత్రి అస్వస్థతకు గురవడంతో ఏలూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిపారు. వెంకటలక్ష్మి భర్త హేమంత్ గతంలో ఎస్‌ఎఫ్‌ఐలో పని చేయగా ప్రస్తుతం మీడియాలో పని చేస్తున్నారు. వీరికి సంవత్సరం పాప ఉంది. ఆమె మృతికి జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మండలాల్లోని పలువురు పాత్రికేయులతో పాటు ప్రజాసంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

## మూత్రపిండాల సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రపంచ మూత్ర పిండాల దినోత్సవం సందర్భంగా బయ్యనగూడెం పిహెచ్‌సిలో వైద్యాధికారి ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ డయాలసిస్ సెంటర్ వైద్యులతో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కోట సుబ్బారావు మాట్లాడుతూ శరీర అవయవాల్లో మూత్ర పిండాల పాత్ర చాలా ముఖ్యమైందన్నారు. మూత్ర పిండాలు పూర్తిగా దెబ్బతింటే కిడ్నీ అమర్చుకోవటం, కిడ్నీ పనితీరు తగ్గితే డయాలసిస్ చేయించుకోవాలని తెలిపారు. జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్‌లో డయాలసిస్ సేవలు ఉపయోగించుకోవాలని తెలిపారు. బయ్యనగూడెం వైద్యాధికారి డాక్టర్ వి.సత్యనారాయణ మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లు తో కిడ్నీ ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు.

## విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం రామసింగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్, పరీక్షకు అవసరమైన స్టేషనరీ ఎస్‌టియు పెదవేగి మండల శాఖ తరపున అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టివి.పద్మావతి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు పెదవేగి మండలాధ్యక్షులు నాగార్జున, ఎండి షఫీ, పేరెంట్స్ కమిటీ ఛైర్మన్ సోనీ, గ్రామ పెద్దలు మధ్యాహ్న వెంకటేశ్వరరావు, గుప్తా, భూషణం, ప్రవీణ్ పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి :** ప్రణాళికా బద్ధంగా, సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం వల్ల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని మండల పరిధిలోని పోతవరప్పాడు గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్ అన్నారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్న 170 మంది విద్యార్థులకు గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ ద్వారా ఆయన పరీక్షల సామగ్రిని అందించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత, ఉపాధ్యాయులు బివిఎస్.లక్ష్మి, జె.వెంకటేశ్వరరావు, ఎస్.అల్లాభక్షు, ఎన్.ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

## నేరాలు - ఘోరాలు

## ఉద్యోగం ఇప్పిస్తానంటూ మోసం

**వ్యక్తిపై యువతి ఫిర్యాదు**

ప్రజాశక్తి - ముదినేపల్లి

చదువు పూర్తి చేసుకుని ఉద్యోగ ప్రయత్నంలో ఉన్న ముదినేపల్లి గ్రామానికి చెందిన ఒక యువతిని ఒక వ్యక్తి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో ఆమె వద్ద నుంచి సుమారు రూ.రెండు లక్షల వరకు ఆన్‌లైన్ ద్వారా తీసుకుని ఉద్యోగం ఇప్పించకుండా ఆ వ్యక్తి పరారయ్యాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన యువతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

## నూజివీడు ఆర్‌జియుకెటిలో మెగా ఎక్స్‌పో-25

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటిలో మెగా ఎక్స్‌పో-25 ఘనంగా నిర్వహించారు. ఈ ఎక్స్‌పోలో సిఎఒ, డిఒఎ, అసోసియేట్ డిఒఎ, హెచ్‌ఒడి పాల్గొని ప్రదర్శనలను సమీక్షించారు. పోటీలు నిర్వహించగా మొత్తం పది బృందాలు అత్యుత్తమ ప్రదర్శన కోసం అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్ అందుకున్నాయి. ఎఐటిఎఎం, ఎన్‌ఆర్‌ఐ, శారద, లక్కిరెడ్డి బాలరెడ్డి వంటి 13 కాలేజీల నుంచి కూడా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు టెడ్ టాక్‌ను కూడా నిర్వహించారు. విద్యార్థుల ప్రదర్శనలు, టెక్ జైట్-25 విజేతలకు బహుమతులు అందించారు. చివరిగా కేరళ డ్రమ్స్ వారి ప్రదర్శనతో గొప్పగా ముగిసింది. కేరళ డ్రమ్స్ వారి ప్రదర్శన విద్యార్థులను చాలా ఆకట్టుకుంది.

## 500 మందికి ఉచిత వైద్య సేవలు

ప్రజాశక్తి - పోలవరం

ప్రతి గిరిజనుడు భగవాన్ బిర్సా ముండా స్ఫూర్తితో ఎదగాలని ఒఎన్‌జిసి చీఫ్ జనరల్ మేనేజర్ మురుగేషన్ అన్నారు. మండలంలోని చేగొండపల్లిలో ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒఎన్‌జిసి సౌజన్యంతో గౌతమి నేత్రాలయ వైద్య నిపుణులతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరంలో జరిగిన సమావేశంలో ఐటిడిఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ గంగు అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజారోగ్య సంరక్షణకు ఒఎన్‌జిసి అందించిన సేవా సహకారాలు ఎనలేనివన్నారు. గిరిజనులకు ఆధ్యుడు, పూజ్యుడు భగవాన్ బిర్సాముండా 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య జనరల్ వైద్య శిబిరం నిర్వహణకు సహాయ సహకారాలు అందించిన ఒఎన్‌జిసి అధికారులకు, గౌతమి నేత్రాలయ వైద్య నిపుణులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒఎన్‌జిసి మేనేజర్ పాల జైవర్, చీఫ్ జియో ఫిజిసిస్ట్ కె.ముత్తయ్య మాట్లాడారు. ఈ సేవా శిబిరంలో సుమారు 500 మంది వైద్య సేవలు పొందారని వారిలో 200 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశామని అనిల్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కలుం బాపిరాజు, జారం సీతారామలక్ష్మి, మాజీ వైస్ ఎంపిపి చాపర్ల వెంకటాచలం, కొవ్వాసి జగదీశ్వరి, చేగొండపల్లి నాయకులు కాటాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

**ఉచిత నేత్ర వైద్య శిబిరం**

**నూజివీడు టౌన్ :** మండలంలోని మీర్జాపురం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఉచిత పరీక్షలు నిర్వహించి, గ్రామ సర్పంచి గోళ్ల పద్మ వెంకటేశ్వరరావు చేతులమీదుగా ఉచిత మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గోళ్ల పద్మ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తిరివీధి కృష్ణ తన తల్లిదండ్రుల పేరిట సేవా ట్రస్ట్ ఏర్పాటుచేసి, నిజమైన పేదలకు వైద్య సేవలు క్షేత్రస్థాయిలో అందించడం అభినందనీయమన్నారు. పేదలకు ఉచిత న్యాయ సేవ అందించడమే కాకుండా సామాజిక సేవలో భాగంగా పేద కుటుంబాలకు వైద్య సేవలను చేరువ చేయడం ప్రశంసనీయమన్నారు. నేటి యువత తిరివీధి కృష్ణ బాటలో పయనించాలని సూచించారు. సేవా ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి కృష్ణ, టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు గోళ్ల భాస్కర్‌రావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిసి హాస్టల్‌లో మేఘలాదేవి తనిఖీలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెంలో బాలికల బిసి హాస్టల్‌ను ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్గనైజింగ్ కమిటీరాష్ట్ర కార్యదర్శి గంగిరెడ్ల మేఘలాదేవి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి విద్యార్థినిలు వచ్చి ఉంటున్నారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని హాస్టల్ వార్డెన్ కుసుమకు సూచించారు. ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకురావాలి తెలిపారు. అనంతరం విద్యార్థినులతో ముచ్చటించారు.

## ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నగర పంచాయతీలో ఉన్న చెరువుల విస్తీర్ణం సర్వే చేయించి సరిహద్దులను గుర్తించి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిషనర్ పి.పావనికి బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ చింతలపూడి పెద్ద చెరువు, బోయగూడెం పెద్ద చెరువు, వేగేలింగేశ్వర స్వామి చెరువు, మొహిద్దిన్ కుంటలను ఆక్రమించి ఆ స్థలంలో భవనాలు నిర్మిస్తున్నారన్నారు. మిగిలిన చెరువులు సైతం ఆక్రమణకు గురై సాగు భూములుగా మారుతున్నాయన్నారు. చెరువుల విస్తీర్ణం సర్వే చేయించి సరిహద్దులను గుర్తించి ఆక్రమాల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే సిపిఐ ప్రత్యక్ష ఆందోళనలకు కూడా సిద్ధమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కమిటీ సభ్యులు కృష్ణ, పట్టణ నాయకులు ఎస్‌కె.కాలేషా, తాడిగడప మాణిక్యాలరావు, మోర్తా లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్రపుడెక్క తొలగింపు పనులు ప్రారంభం

**ముదినేపల్లి:** మండలంలోని పెదకామనపూడి వద్ద పెద్ద కొమ్మిలేరు డ్రెయిన్‌లో మెషిన్ ద్వారా గుర్రపుడెక్క తొలగింపు, పూడికతీత పనులను ఎంఎల్‌ఎ కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న కాలంలో ఏ గ్రామం ముంపునకు గురవ్వకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నియోజవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, జనసేన మండలాధ్యక్షుడు వీరంకి వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తీరిన కరెంటు కష్టాలు

**15 ఏళ్ల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించిన ఎఇ శ్రీరామ్**

ప్రజాశక్తి - ఉంగుటూరు

లైన్ పనులు చేస్తున్న సిబ్బంది

నారాయణపురం టూరింగుపేట, వైఎస్‌ఆర్ నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, కొత్త ఉంగుటూరు విద్యుత్ వినియోగదారుల సమస్యలు తీర్చేందుకు అధికారులు చేపట్టిన పనులు పూర్తి కావచ్చాయి. 2011కు ముందు నారాయణపురం విద్యుత్ ఉపకేంద్రం నుంచి నారాయణపురం, కొత్త ఉంగుటూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసేవారు. అయితే 2011లో చేబ్రోలు విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మించాక ఈ గ్రామాలకు చేబ్రోలు ఎస్‌ఎస్ నుంచే పవర్ సరఫరా చేసేవారు. చేబ్రోలు, నారాయణపురం టూరింగుపేట, వైఎస్‌ఆర్ నగర్, ఎన్‌టిఆర్ కాలనీ, కొత్తఉంగుటూరుతో పాటు నిడమర్రు మండలం కొల్లేరు గ్రామాలకు రక్షిత తాగునీటిని అందించే ఆర్‌డబ్ల్యూఎస్ ట్యాంకు కూడా నారాయణపురంలో ఉంది. సుమారు 1600 సర్వీసులకు ఒకటే ఫీడర్ ద్వారానే విద్యుత్ వచ్చేది. దీంతో ఈ నాలుగు ఆవాస ప్రాంతాల్లో ఎక్కడైనా సమస్య వస్తే ఈ 1600 మంది సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయేది. దీనికి తోడు నారాయణపురంలో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల సర్వీసుల కూడా ఇదే ఫీడరు మీద ఉండటంతో విద్యార్థులు ఆన్‌లైన్ పరీక్షల సమయంలో ఎన్నో ఇబ్బందులు పడేవారు. నిడమర్రు మండలంలో తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, చిననింద్రకొలను గ్రామాలకు తాగునీటి సరఫరా సైతం కష్టంగా ఉండేది.

**రూ.15 లక్షలతో పనులు పూర్తి ఎఇ శ్రీరామ్**

సుమారు 1600 సర్వీసులకు ఇప్పటి వరకూ చేబ్రోలు ఫీడర్ మీదే ఉండేది. దీంతో అత్యవసర సమయంలో ఎల్‌పి తీసుకున్నా, ఎమర్జన్సీ లోడ్ రిలీఫ్ తీసుకున్నా వీళ్లందరికి కరంటు ఉండేది కాదు. దీనికి పరిష్కారం కోసం ఉంగు టూరు సబ్ స్టేషన్ నుంచి రూ. 15 లక్షలతో కొత్తగా లైన్ వేసి ఉంగుటూరు ఫీడరుపైన లైన్ కలిపేందుకు ఎంఎల్‌ఎ ధర్మరాజు, ఎడిఇ ఎన్.శ్రీనివాసరావులు సహకారం అందించారు.

**దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడం సంతోషం లైన్‌మెన్ దుర్గారావు**

నారాయణపురం టూరింగుపేట పాటు సుమారు 1600 సర్వీసులకు చేబ్రోలు ఫీడరు మీద ఉండటంతో నిత్యం విద్యుత్ సమస్యతో క్షణం తీరిక లేకుండా ఉండేది. రేయింబవళ్లు ఏదోక సమస్య రావడం నిత్యం ఫీల్డ్‌లోనే ఉండాల్సి వచ్చేంది. అస్తమానం కరంటు పోవడంతో వినియోగదారుల నుంచి ఎన్నో ఒత్తిళ్లు వచ్చేవి. అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు సమస్యను తీసుకెళ్లేవాళ్లం. దీంతో ఉంగుటూరు సబ్ స్టేషన్ నుంచి సరఫరాలను ఆల్టర్‌నేటివ్ విధానంలో కలిపేలా సుమారు ఏదాదిన్నర నుంచి లైన్ నిర్మాణ పనులు ఇప్పటికి పూర్తయ్యాయి. చేబ్రోలు ఎస్‌ఎస్‌లో సమస్య వస్తే ఉంగుటూరు ఎస్‌ఎస్ నుంచి సరఫరా ఇస్తాం. ఇక కరంటు సమస్యలు తీరినట్టే.

## నిధుల మంజూరు కోరుతూ కేంద్ర మంత్రికి ఎంపీ వినతి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు సబ్‌వేస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కారీకి ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ హౌస్ మంత్రి ఛాంబర్‌లోని కార్యాలయంలో బుధవారం మంత్రిని కలిసి వినతిపత్రం అందించినట్లు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జిల్లా పరిధిలోని జాతీయ రహదారుల్లో ప్రమాదాల నివారణకు సబ్‌వేస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, అదేవిధంగా గుండుగొలను నుంచి కొల్లేటికోటకు డబుల్ లైన్ రోడ్డు నిర్మాణానికి రూ.109 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. భీమడోలు వద్ద రెండు కిలోమీటర్ల ఫ్లై ఓవర్ నిర్మించాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కురెళ్లగూడెం వద్ద ప్రజలు ఇంటర్ చేంజ్ క్రాస్ పాయింట్‌ను దాటి అవతలి వైపునకు రాకపోకలు సాగించే సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైళ్ల రాకపోకల వల్ల జరిగే ప్రమాదాలను పరిగణలోకి తీసుకుంటూ ఉంగుటూరు వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని, దెందులూరు మండలం సీతంపేట జంక్షన్ వద్ద నాలుగు మీటర్ల ఎత్తు బాక్స్ కల్వర్టు నిర్మాణంతో పాటు గుండుగొలను జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి, బాక్స్ కల్వర్టు నిర్మాణానికి, ఇలా అనేక రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు పేర్కొన్నారు. దీనిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

## ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా సలహాలు ఇవ్వండి

**కలెక్టర్ కె.వెట్రిసెల్వి**

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు తమ సూచనలు, సలహాలు అందించాలని కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో ఈ నెల 31 లోపు రాజకీయ పార్టీలు తమ సూచనలను సంబంధిత వెబ్‌సైట్ ద్వారా తెలియజేయవచ్చని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పేర్కొన్నారు. చట్టపరమైన పద్ధతిలో ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి పరస్పర చర్య కోసం పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులను ఎన్నికల సంఘం ఆహ్వానిస్తుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీలకు జారీ చేసిన వ్యక్తిగత లేఖలో కమిషన్ ఏర్పాటు చేసిన చట్టానికి అనుగుణంగా ఎన్నికల ప్రక్రియలను మరింత బలోపేతం చేయడానికి, పరస్పర అనుకూలమైన సమయంలో పార్టీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ సభ్యులతో పరస్పర చర్చలను ఆశిస్తోందని తెలిపారు.

## బోదకాలు వ్యాధిగ్రస్తులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

బోదకాలు వ్యాధిగ్రస్తులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, అప్పుడే ఇతర ఇన్ఫెక్షన్స్ రాకుండా ఉంటాయని డిఎంహెచ్‌ఒ డాక్టర్ మాలిని సూచించారు. స్థానిక ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రం పవర్‌పేటలో 24 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులకు బోదకాలు క్లీన్ చేసుకోవడానికి మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కిట్స్‌ను డాక్టర్ మాలిని బుధవారం అందించారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి పిఎస్‌ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ బోదకాలు మురికి కాలువల్లో పెరిగే ఆడ క్యూలెక్స్ దోమ కుట్టడం వల్ల సంక్రమిస్తుందన్నారు. ఈ వ్యాధి కాళ్లు, చేతులు, రొమ్ము, ఇతర అవయవాలకు కూడా రావొచ్చని తెలిపారు. దీనికి మందులు లేవని, పరిశుభ్రత ఒకటే మార్గమని సూచించారు. అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు బోదకాలు ఏ విధంగా క్లీన్ చేసుకొని ఆయింట్మెంట్ ఎలా రాసుకోవాలో సోదాహరణంగా వారికి చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, రోహిత్, హెల్త్ సూపర్‌వైజర్ ఝాన్సీ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి సాయం అందజేత

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కుటుంబసభ్యులు కటికల నాగబాబు (యేసు) ఇటీవలే ఆత్మహత్య చేసుకుని మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్‌మెంట్ డైరెక్టర్ కొడాలి వినోద్ బుధవారం వడాలి గ్రామం వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి మృతుని కుటుంబ సభ్యులకు రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, నాయకులు పాల్గొన్నారు.

## పలుచోట్ల వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రమైన కొయ్యలగూడెంలో వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వైఎస్‌ఆర్ నగర్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఆ పార్టీ మండల, పట్టణ నాయకుల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అంకాలగూడెంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

**పోలవరం :** మండలంలోని పలు గ్రామాల్లో పోలవరం, కొత్తపట్టిసీమ, గూటాల గ్రామ పంచాయతీల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పోలవరం, కొత్త పట్టిసీమ, గూటాల గ్రామాల్లో వైసిపి నాయకులు, కార్యకర్తలు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు.

**ఉంగుటూరు :** వైసిపి 14వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు చేబ్రోలులో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ మరడ వెంకట మంగారావు మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవ కేకు కట్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఏలూరులో కలెక్టరేట్ వద్ద ధర్నాకు హాజరయ్యారు.

**చింతలపూడి :** వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పట్టణంలోని మారుతీనగర్‌లో నిర్వహించారు. వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా మున్సిపల్ వింగ్ అధ్యక్షులు బొడ్డు వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మిరియాల దిలీప్ మాట్లాడారు.

**ద్వారకాతిరుమల :** ద్వారకాతిరుమల వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి టౌన్ ప్రెసిడెంట్ అచ్యుత ఏసుబాబు, నాయకులు ఉక్కుర్తి వెంకటరావు, చిలుకూరి చంద్రశేఖరరావు, చెన్నూరి రామకృష్ణ, వార్డు మెంబర్ చిలుకూరి నాగ సుబ్రహ్మణ్యం, దూలపల్లి ప్రసాద్, రామాయణం నాగ చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**టి.నరసాపురం :** టి.నరసాపురంలో జెడ్‌పిటిసి సభ్యులు సామంతపూడి బాలసూర్యనారాయణరాజు పార్టీ జెండాను ఆవిష్కరించి కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**చాట్రాయి :** చిత్తపూరులో రాష్ట్ర కోపరేటివ్ యూనియన్ మాజీ ఛైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సెంటర్‌లో వైఎస్‌ఆర్ విగ్రహానికి వైసిపి నాయకులు ఆరెల్లి కృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచారు.

## ఎస్‌టిలకు న్యాయం జరిగే వరకూ పోరాటం

**సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్**

**ముదినేపల్లి :** ఎస్‌టిలకు న్యాయం జరిగే వరకూ తాము పోరాటం చేస్తామని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ జిల్లా కార్యదర్శి టి.ప్రకాష్ అన్నారు. ముదినేపల్లి తహశీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని కొత్తపల్లి ఎస్‌టిలతో కలిసి ఆయన ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ మండలంలోని కొత్తపల్లి ఎస్‌టిలు భూమిలేని నిరుపేదలు 1958 సంవత్సరం నుంచి రీ సర్వే నెంబర్ 415 రుయ 1.85ట్లు మలపరాజు చెరువు భూమి దిబ్బను గత 67 ఏళ్లుగా దాసరి బలరాముడు, అతని కుమారులు వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నారన్నారు. భూమిలేని ఎస్‌టిలు వ్యవసాయం చేసుకుని సాగు చేసుకుంటున్నా ఈ భూమిని కొంతమంది పెద్దలు వీరిని బెదిరిస్తూ పొలాన్ని ఖాళీ చేయాలని వీరిపై దౌర్జన్యం చేస్తున్నారన్నారు. 67 ఏళ్లుగా వ్యవసాయం చేసుకొని కుటుంబాలను పోషించుకుని బతుకుతున్న ఎస్‌టిలను కొందరు భూ బకాసురులు పొలాన్ని ఖాళీ చేయించి మట్టి తవ్వుకుని అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వీరి భూమికి రక్షణ కల్పించి ఈ భూమిని దున్నుకుని పంటలు పండించుకునే హక్కులు ఎస్‌టిలకు కల్పించాలని కోరారు. లేకపోతే సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని ప్రకాష్ హెచ్చరించారు. అనంతరం ఎస్‌టిలకు సదరు భూమిపై హక్కులు కల్పించాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ ఐ.పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు రమేష్, హరిబాబు, సత్యనారాయణ, ప్రసాద్, ఎస్‌టి కులస్తుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

**గ్రామపంచాయతీ కార్యాలయము, ఆగిరిపల్లి**

**టెండరు ప్రకటన**

రే.క.నెం.43/JA/2025 తేది.12-03-2025

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఆగిరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని జిల్లా గ్రంధాలయ సంస్థ ప్రక్కన గల గ్రామపంచాయితీ కి చెందిన రెండు షాపులకు సుదహరించిన షెడ్యూలు దాఖలా లకు బహిరంగ వేలం నిర్వహించుటకు పై అధికారుల ఉత్తర్వుల ననుసరించి ది. 19-03-2025వ తేది బుధవారం సాయంత్రం 4.00 గం॥లకు ఆగిరిపల్లి గ్రామపంచాయితీ కార్యాలయము వద్ద సదరు పంచాయతీ కార్యదర్శి గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం వేయబడును. బహిరంగ వేలము నందు పాల్గొనదలచిన వారు సంబందిత తహసిల్దారు వారి వద్ద నుండి పొందిన రూ. 10,00,000/- లకు సాల్వెన్సి దృవీకరణ మరియు షెడ్యూల్ నందు తెలిపిన ధరావతులు చెల్లించి హెచ్చు పాట మొత్తము ఏక మొత్తములో వెంటనే చెల్లించు విధానము ననుసరించి బహిరంగ వేలం పాటలలో పాల్గొనవలయును. వేలం షరతులు మరియు ఇతర వివరములు కార్యాలయము పనిచేయు వేళల యందు తెలిసికొనవచ్చును.

| వ.నెం. | అయిటమ్ వివరము | చెల్లించవలసిన ధరావత్తు | పాట కాలపరిమితి 3 సం॥లకు |
|---|---|---|---|
| 1 | జిల్లా గ్రంధాలయ సంస్థ ప్రక్కన షాపు - 1 | రూ. 1,00,000/-లు | 01-04-2025 నుండి 31-03-2028 వరకు |
| 2 | జిల్లా గ్రంధాలయ సంస్థ ప్రక్కన షాపు - 2 | రూ. 1,00,000/-లు | 01-04-2025 నుండి 31-03-2028 వరకు |

సం/- బొల్లినేని ప్రసాద్
గ్రామపంచాయితీ కార్యదర్శి, ఆగిరిపల్లి,
ఆగిరిపల్లి మండలం, ఏలూరు జిల్లా.

## పొలసానిపల్లి గ్రామపంచాయతీ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో, క్రమ పద్ధతిలో పరిష్కరిస్తున్న పొలసానిపల్లి గ్రామపంచాయతీ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. గ్రామపంచాయతీ పరిధిలోని నాలుగో వార్డులో ప్రజలకు, రైతులకు సేవలందించేందుకు పుంత రోడ్డు ఉంది. కాలక్రమేన సదరు రోడ్డు వివిధ కారణాల వల్ల దశాబ్దాల కాలంగా నిరుపయోగంగా మారింది. దీనిపై సర్పంచి షేక్ రహీమా బేగం హసేన, ఇతర గ్రామపంచాయతీ కార్యవర్గం స్పందించారు. పుంత రోడ్డును బాగు చేయడంతో పాటు దానిని ఆధునీకరించే క్రమంలో గ్రావెల్ రోడ్డుగా మార్చేందుకు గ్రామపంచాయతీ నిధులు మంజూరు చేశారు. ఈ పనులకు బుధవారం గ్రామ సర్పంచి శంకుస్థాపన చేశారు. ప్రారంభమైన పనులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు గంజి సుబ్బారావు, ఎం.శ్రీనివాసరావు, వి.గోవింద్ పాల్గొన్నారు.

**పాస్‌పోర్ట్ పోయినది**

దుండి లావణ్య, భర్త: కనకారావు, డోర్ నెం. 5-89, పెదపేట, వీరవాసరం, వీరవాసరం మండలం, ప॥గో॥జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ది. 06-06-2024 న Y3424554 నెంబర్ పాస్‌పోర్ట్ తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్‌ను తీసుకొని ది. 20-02-2025 న పాలకొల్లు మండలం, వెలివెలలోని మా అమ్మ వద్దకు పాస్‌పోర్ట్ గురించి మాట్లాడటానికి వెళ్లినపుడు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ జిరాక్స్ తీయడానికి లంకల కోడేరు ఆటోలో వెళ్ళగా నేను వైజాగ్ లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్‌కు ఇవ్వవలసినదిగా కోరి ప్రార్థిస్తున్నాను.

**సెల్ : 83676 09044**

**పాస్‌పోర్ట్ పోయినది**

పశ్చిమ గోదావరి జిల్లా, యలమంచిలి మండలం, గుంపర్రు పంచాయితీ పరిధి లంకపాలెం గ్రామానికి చెందిన కంకటాల రూపవతి, భర్త: కంకటాల నాగరాజు, డోర్ నెం. 3-19/2 నకు చెందిన **P 9984294** నెంబర్ గల పాస్‌పోర్ట్ విశాఖపట్నం వారు ది. 12-04-2017 న జారీ చేసిన పాస్‌పోర్ట్ పోయినది. లంకపాలెం నుండి దొడ్డిపట్ల జిరాక్స్ నిమిత్తం మోటర్ సైకిల్ పై వెళుతుండగా పాస్‌పోర్ట్ కలిగిన కవరు మార్గమధ్యలో పడిపోయినది. ఆ కవరులో విశాఖపట్నం వారి జారీ చేసిన **P 9984294** **ఒరిజినల్ పాస్‌పోర్ట్** కలిగి ఉంది. కావున ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్‌ను సంప్రదించగలరు.

**కంకటాల రూపవతి**
**భర్త: నాగరాజు,**
**డోర్ నెం. 3-19/2, గుంపర్రు,**
**లంకపాలెం, యలమంచిలి మండలం,**
**ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**
**పిన్. నెం: 534266**
**సెల్: 95500 83497**

**మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొత్తపేట**
**H.M.O.P. No. 109/2023**

**Between:**
అడ్డాల సురేష్ ...పిటీషనర్
మరియు
అడ్డాల మధు మాధవి మణి ...రెస్పాండెంటు

రెస్పాండెంటు అడ్రసు:-
అడ్డాల మధు మాధవి మణి,
W/o. అడ్డాల సురేష్
D/o. జి. రాజశేఖర్
వయస్సు 35 సం॥, ప్రైవేటు జాబ్,
R/o. విస్సాకోడేరు విలేజ్, పాలకోడేరు మండలం.

పై నెంబరు OP లో మీకు జారీకావలసిన నోటీసులు చాలా పర్యాయములు కోర్టు ద్వారాను, రిజిష్టర్ పోస్ట్ ద్వారాను పంపించినప్పటికి మీరు తీసుకొనక Avoid చేసినందున **ది. 19-03-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానించబడునని యిందుమూలంగా మీకు తెలియజేయడమైనది.

**Sri. Pakerla Srinivas**
**Panthagani Keerthi**
Advocates,
Bhimavaram, W.G.Dt
Cell: 98483 91100
Kothapeta
Dt. 12-03-2025

**మహారాజశ్రీ నర్సాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (Junior Division) వారి కోర్టులో**
**O.S.No. 225/2023**

**Between:**
**Plaintiff :** Sagireddy Venkata Subbarao
And
**Defendant :**
Mohammad Abdul Basheer and oters
**To**
2. Mohammad Ahmed Valli, S/o Masthan Saheb, R/o Door no.12-2-13/4, 13th Ward, Narsapur.
3. Mohammad Hussain, S/o Zainulabdin, 16th Ward, Panja Centre, Narsapur.
4. Mohammad Badrunnisa, D/o Hussain, 16th Ward, Panja Centre, Narsapur.
5. Mohammad Zainulabdin, S/o Hussain, 16th Ward, Panja Centre, Narsapur.

పై 2 to 5 ప్రతివాద్దు కు పై నెంబరు దావాలో కోర్టు వారు ఎన్ని పర్యాయములు దావా సమన్లు పంపినప్పటికిన్ని మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున సదరు దావాలోని దావా సమన్లు మీకు అమలు జరుగు నిమిత్తం ఈ పేపరు ప్రకటన ద్వారా అమలు జరపడమైనది. కాబట్టి **ది. 7-4-2025వ తేదీన ఉదయం గం. 10-30 ని.లకు** పై కోర్టులో మీరు స్వయముగా గాని, అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై మీ యొక్క వాదనను దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీకు వ్యతిరేకముగా తీర్మానించబడును.

// By orders of Court //

శ్రీ గునిశెట్టి శ్రీనివాసరావు,
అడ్వకేట్, నర్సాపురం,
ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
సెల్: 95531 26234
నర్సాపురం
ది.12-03-25,